క్లుప్తంగా

వాసవీ మాత పారాయణం జిల్లా ఇన్‌చార్జ్‌గా వాసంతి



నేరేడుచర్ల : వాసవీ మాత పారాయణం జిల్లా ఇన్‌చార్జ్‌గా నేరేడుచర్ల పట్టణానికి చెందిన ఆర్య వైశ్య సంఘం మహిళా విభాగం నాయకురాలు కందిబండ వాసంతి నియమితులయ్యారు. ఈమేరకు వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి సోమవారం ఆమెకు నియామక పత్రం అందజేశారు. వాసంతి నియామకం పట్ల ఆర్యవైశ్య సంఘం, వాసవీ, వనితా క్లబ్‌ల సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో 'జయ' విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో పాఠశాల ప్రిన్సిపాల్

కోదాడ : సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో కోదాడ పట్టణంలోని జయ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రెండవ లెవల్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ చిలువేరు వేణు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన పి.కీర్తి, ఎస్‌కె.జాహిద్, పి.వసంతరామ్, ఏ.లిఖిత ప్రియ, ఎస్‌కె.అబ్దుల్ ముసావీర్, సీహెచ్. అక్షయ్ రెండవ లెవల్‌కు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను పాఠశాల నిర్వాహకులు జెల్లా పద్మ, బింగి జ్యోతి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు.

ఫిజియోథెరపీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మహేష్

నడిగూడెం : ఫిజియోథెరపీపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని మండల విద్యాధికారి బి.ఉపేందర్‌రావు కోరారు. సోమవారం నడిగూడెంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో హైదరాబాద్‌కు చెందిన నిజాం ఫిజియోథెరపీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపీపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ మహేష్ ఫిజియోథెరపీపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బడి బయటి పిల్లలపై సర్వే



కాగితరామచంద్రాపురంలో సర్వే చేస్తున్న సీఆర్పీ గోవర్ధన్

నడిగూడెం : బడీడు పిల్లలను బడికి పంపాలని సీఆర్పీలు బందారపు గోవర్ధన్, రాజుల గురుస్వామి, నందిగామ రామారావు కోరారు. సోమవారం మండలంలోని కాగితరామచంద్రాపురం, కరివిరాల, రామాపురం, రత్నవరం గ్రామాల్లో బడి బయట ఉన్న బడీడు పిల్లల కోసం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మించాలని వినతి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని 13వ వార్డులో డ్రెయినేజీ నిర్మించాలని బీజేపీ నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. జాన్‌పహాడ్ రోడ్డులో గల పూల తోట ప్రాంతం, జూలూరు అశోక్ వీధిలో డ్రెయినేజీ లేక మురుగు నీరు ఇళ్లల్లోకి వస్తుందని, పాదాచారులు, వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొణతం నాగిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు సంకలమద్ది సత్యనారాయణరెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు జూలూరు అశోక్, ఊరిమళ్ల రామ్మూర్తి, తాళ్ల నరేందర్‌రెడ్డి, నాగయ్య, శంకర్‌రెడ్డి, నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఆధార్‌కార్డుల సవరణ వేగవంతం చేయాలి

హుజూర్‌నగర్ : ఆధార్ కార్డుల్లో తప్పులు, మార్పులు, చేర్పుల ప్రక్రియను వేగవంతం చేయాలని కాంగ్రెస్ నాయకుడు మన్సూర్ అలీ కోరారు. ఈమేరకు సోమవారం హుజూర్‌నగర్‌లో ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డికి ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు.

'ప్రత్యేక' పాలన అస్తవ్యస్తం..!

- వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం
- మురికి కూపాలుగా డ్రెయినేజీలు
- దోమల వ్యాప్తితో ప్రజలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



పాలకవీడు మండల కేంద్రంలో మురికి కూపాలుగా డ్రెయినేజీలు



ఇంటి పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం

పాలకవీడు : గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి అస్తవ్యస్తంగా మారింది. వీధుల్లో చిన్న గుంత ఏర్పడినా పూడ్చేవారే కరువయ్యారు. కాలనీల్లో ఇళ్ల నడుమ ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతుంది. దీంతో ఈగలు, దోమల బెడద పెరిగి వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. పాలకవీడు మండల కేంద్రంలో నెలల తరబడి డ్రెయినేజీల్లో చెత్తాచెదారం, మురుగు తొలగించకపోవడంతో మురికి కూపంగా తయారయ్యింది. ముఖ్యంగా ఎస్సీకాలనీలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రెయినేజీల్లో మురుగు పేరుకుపోవడంతో ఇళ్లల్లోకి దుర్వాసన వస్తుందని వాపోతున్నారు. అదే విధంగా దోమల వ్యాప్తి అధికంగా ఉందని, సీసీరోడ్డుపై మురుగు పారుతుండడంతో నడవలేని దుర్భర పరిస్థితి నెలకొందని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొంటున్నారు.

రోగాల బారిన ప్రజలు..

పారిశుద్ధ్య సమస్యను పట్టించుకోకపోవడంతో అనారోగ్యం బారిన పడుతున్నామని వాపోతున్నారు. సరిగ్గా రెండు నెలల క్రితం ఇదే కాలనీల్లో ప్రతీ ఇంట్లో డెంగీ, చికెన్‌గున్యా బారినపడినట్లు చెబుతున్నారు. కాలనీలోని ఇంటి సమీపంలోనే చెత్తాచెదారం పేరుకుపోవడంతో పాటు మురుగు రోడ్లపై పారుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పర్యవేక్షణ లోపంతోనే..

గ్రామపంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే సమస్యల సుడిగుండంలో ప్రజలు సతమతమవుతున్నారు. పల్లెల్లో మురుగు కాల్వల పరిస్థితి దయనీయంగా మారడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీనికితోడు నాసిరకంగా సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మించిన కొద్ది రోజులకే ధ్వసమవుతుండడంతో మురుగునీరు రోడ్లపై పారుతుంది. మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు..

క్రమం తప్పకుండా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని జిల్లాస్థాయి సమావేశాల్లో కలెక్టర్ ఆదేశాలు జారీ చేస్తున్నారు. గ్రామాల దుస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తుంది. జిల్లా, మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ లోపం కనిపిస్తుంది. అధికార యంత్రాంగం నిత్యం విధులు నిర్వర్తిస్తున్నా మండల కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే మిగిలిన గ్రామాల పరిస్థితి ఎలా ఉందోనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్ హయాంలో రైతుల ఆత్మహత్యలు

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్



నేరేడుచర్లలో మాట్లాడుతున్న బడుగుల లింగయ్య యాదవ్

నేరేడుచర్ల : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 408 రోజుల్లో 402 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని బీఆర్‌ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ పేర్కొన్నారు. సోమవారం నేరేడుచర్ల పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశం అనంతరం హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయ కర్త ఒంటెద్దు నర్సింహారెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన తరువాత ఏ ఒక్కటి కూడా అమలు చేయకుండా ప్రజలు, రైతులను మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో రూ.2 లక్షల రుణ మాఫీ, రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి రెండు పంటలు గడిచినా నేటి వరకు కూడా రైతు భరోసా ఇవ్వలేదన్నారు. మహిళలకు రూ.2,500, కల్యాణ లక్ష్మి పథకం, తులం బంగారం హామీలను రేవంత్ రెడ్డి తుంగలో తొక్కారని విమర్శించారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నేరేడుచర్ల, పాలకవీడు మండలాల పార్టీ అధ్యక్షులు అరిబండి సురేష్‌బాబు, కిష్టపాటి అంజిరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, మండల, పట్టణ పార్టీ కార్యదర్శులు ఎల్లబోయిన లింగయ్య, చిత్తలూరి సైదులు, నాయకులు సైదిరెడ్డి, సైదులు, జయబాబు, నాగేండ్ల శ్రీధర్, కడియం వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, నవీన్, రాజేష్, సుందరయ్య, వినాయకరావు, పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

నడిగూడెం : కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎంపికైన నడిగూడెంకు చెందిన ఏపూరి తిరుపతమ్మకు సోమవారం ఆమె స్వగృహంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ బడేటి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్‌లు గడ్డం నాగలక్ష్మి, పగడాల పద్మ, నాయకులు పాలడుగు ప్రసాద్, దేవబత్తిని రమేష్ ప్రసాద్, పాలడుగు అర్జునరావు, కాసాని వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణను దూషించిన వ్యక్తిపై ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు పత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

హుజూర్‌నగర్ : ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగను అసభ్య పదజాలంతో దూషించిన పశువుల రామ్మూర్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు చింతిరాల నాగయ్య, మంద నాగరాజు కోరారు. ఈ మేరకు సోమవారం హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మందకృష్ణను కొట్టి చంపే రోజు వస్తుందని, వర్గీకరణకు మద్దతు తెలిపే వారిని దేశం నుంచి వెలివేయాలని పెద్దపల్లి జిల్లా గోదావరి ఖనిలో రామ్మూర్తి వ్యాఖ్యలు చేశాడని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గల్లా వెంకటేశ్వర్లు, ఎమ్మార్పీఎస్ నాయకులు రవీంద్ర, బి.ప్రసాద్, ఎం.శరత్ బాబు, మంద వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన సత్రం అభివృద్ధికి కృషిచేస్తా



చిన్నం వీరమల్లును సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గల భక్త మార్కండేయ పద్మశాలీ నిత్య అన్నదాన సత్రం కమిటీ సమావేశాన్ని సోమవారం సత్రంలో నామని కుమారస్వామి, చిలువేరు అంజయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ నూతన అధ్యక్షుడిగా చిన్నం వీరమల్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఇప్పటివరకు అధ్యక్షుడిగా కొనసాగిన నామని కుమారస్వామిని శాలువాతో సన్మానించారు. అనంతరం చిన్నం వీరమల్లు మాట్లాడుతూ.. అందరి సహకారంతో సత్రం అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం ప్రతినిధులు, నాయకులు ముశం నరసింహ, రామచంద్రయ్య, లక్ష్మీనారాయణ, మార్కండేయ, పుల్లారావు, వేణు, అంకయ్య, సాయి, వెంకటేశ్వర్లు, నరసింహారావు, శ్రీనివాస్, రాజు, మధు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్లలో మినీ బస్టాండ్ నిర్మించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

నేరేడుచర్ల : రాష్ట్రంలో ప్రభుత్వం నూతన బస్టాండ్‌లు నిర్మిస్తున్నందున నేరేడుచర్లలో కూడా మినీ బస్టాండ్ నిర్మించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. సోమవారం నేరేడుచర్లలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేరేడుచర్లలో మినీ బస్టాండ్ ఏర్పాటు చేస్తే సూర్యాపేట జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోని గ్రామాలకు బస్సు సౌకర్యం ఉంటుందన్నారు. నేరేడుచర్ల మండలంలోని 90 శాతం గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమావేశంలో పార్టీ పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు వడ్లపూడి ఉపేందర్, బీసీ హక్కుల సాధన సమితి నాయకులు కిరణ్, సాయిబాబా తదితరులు ఉన్నారు.


బేతవోలు పీఏసీఎస్ మాజీ చైర్మన్ మృతి



సైదులు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్, తదితరులు

చిలుకూరు : మండలంలోని బేతవోలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ చైర్మన్ బాషం సైదులు అనారోగ్యంతో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సైదులు మృతి బాధాకరమని అన్నారు. నివాళులర్పించిన వారిలో డీసీసీబీ డైరెక్టర్ కొండా సైదులు, చిలుకూరు, బేతవోలు పీఏసీఎస్ చైర్మన్లు అలసకాని జనార్దన్, బజ్జూరి రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు బొలిశెట్టి నాగేంద్రబాబు, బండ్ల కోటయ్య, దొడ్డా సురేష్‌బాబు, మాజీ జెడ్పీటీసీ భట్టు శివాజీనాయక్, మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు జానిమియా, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అక్కినపల్లి జానకీరామాచారి, అంబాల రాంబాబు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలి



ఎంపీడీఓతో మాట్లాడుతున్న నాయకులు

పాలకవీడు : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని మాజీ ఎంపీపీ భూక్యా గోపాల్ కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పలువురు నాయకులతో కలిసి ఎంపీడీఓ లక్ష్మిని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల కోసం మంగళవారం నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగి ఉండి జాబితాలో పేరురాని వారు తిరిగి గ్రామసభలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీఓ వీరయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్‌వీ.సుబ్బారావు, మాళోతు మోతీలాల్, నరసింహారావు, మీసాల ఉపేందర్, శేషురెడ్డి, బూషిపల్లి వెంకట్‌రెడ్డి, మునగాల భాస్కర్‌రెడ్డి, ముండల నాగేష్, యాతం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేత

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణంలోని చైతన్య కాలనీలో ఆటో డ్రైవర్ కె.సత్యనారాయణకు ఇటీవల ప్రమాదంలో కాలు విరిగింది. దీంతో ఆయన చికిత్స చేయించుకుని ఇంటి వద్ద ఉంటున్నాడు. సోమవారం పట్టణానికి చెందిన ఎస్వీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సత్యనారాయణకు 50 కేజీల బియ్యం, రూ.2వేల ఆర్థికసాయం అందజేసి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఎస్.చంద్రశేఖర్, శివశంకర్, సాయి, బాబురావు, రాము, రవీందర్, సైదులు, నాగేంద్రబాబు, కిషోర్, నాగన్న, నవీన్, జయంత్ తదితరులు పాల్గొన్నారు.



బియ్యం, నగదు అందజేస్తున్న ఎస్వీ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి

- కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ



నడిగూడెం : అధికారులతో సమావేశమైన ఆర్డీఓ సూర్యనారాయణ

అనంతగిరి : రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల మంజూరుకు లబ్ధిదారుల ఎంపికకు గాను నిర్వహిస్తున్న గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సేద్యంలో ఉన్న భూములకే రైతు భరోసా అందుతుందని తెలిపారు. కోదాడ డివిజన్‌లో రాళ్లు, గుట్టలు, నాలా కన్వర్షన్ అయిన భూములు సుమారు వెయ్యి ఎకరాలను గుర్తించి రైతు భరోసా నుంచి మినహాయించినట్లు తెలిపారు. కోదాడ డివిజన్‌లో ఇటీవల నిర్వహించిన సర్వేలో రేషన్ కార్డుల కోసం దాదాపు 6600 దరఖాస్తులు తీసుకున్నామన్నారు. అనంతరం ప్రజాపాలన– గ్రామసభలు, హెల్ప్‌డెస్క్‌ల ఫ్లెక్సీలను ఆయన ఆవిష్కరించారు. తహసీల్దార్ కె.హిమబిందు, ఎంపీడీఓ షేక్ సుష్మ తదితరులు ఉన్నారు.

అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలి

నడిగూడెం : ఈ నెల 21 నుంచి 24వ తేదీవరకు నిర్వహించనున్న గ్రామ సభలను విజయవంతం చేయాలని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ కోరారు. సోమవారం నడిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా పథకాలకు సంబంధించి జాబితాలో పేర్లు లేని అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని అన్నారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి సతీష్‌కుమార్, తహసీల్దార్ వి.సరిత, ఎంపీడీఓ ఎస్‌డీ.ఇమామ్, మండల వ్యవసాయాధికారి రాయపు దేవప్రసాద్, ఎంపీఓ విజయలక్ష్మి, గ్రామాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు

కోదాడ : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం మంగళవారం నుంచి నిర్వహించబోయే వార్డు సభలను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమాదేవి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇళ్లు,రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోని వారు ఈ సభల్లో మరోసారి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

నేటి నుంచి గ్రామ సభలు

మఠంపల్లి : మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎల్.మంగా తెలిపారు. సోమవారం స్థానికంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలపై ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకొని లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

హుజూర్‌నగర్ : ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల అర్హుల జాబితా సిద్ధం చేసి వార్డు సభల ఆమోదం కోసం 21 నుంచి 24వ తేదీ వరకు వార్డుల వారీగా వార్డు సభలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు ఆయా వార్డు సభలలో పాల్గొని విజయవంతం చేయాలని కమిషనర్ కోరారు.

కోదాడరూరల్ : మండలంలో నేటి నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాంచందర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16 గ్రామాల్లో నాలుగు రోజులు ఈ గ్రామ సభలు నిర్వహించేందుకు షెడ్యూల్ తయారు చేసినట్లు పేర్కొన్నారు.

నేరేడుచర్ల : రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఈనెల 21వ తేదీ నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సోమ సుందర్‌రెడ్డి సోమవారం విలేకరులకు తెలిపారు.

చిలుకూరు : ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం మండల వ్యాప్తంగా మంగళవారం నుంచి బుధవారం వరకు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ధృవకుమార్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జగదీష్ సోమవారం తెలిపారు. రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్ల కోసం జాబితాల్లో పేరు లేని వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

మునగాల : మండలంలో 21వ తేదీ నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్ తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుభరోసా, ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు లబ్ధిదారులను ఈ గ్రామ సభల్లో గుర్తించనున్నట్లు తెలిపారు.

మోతె : పథకాల అమలు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల మంజూరుకు గాను లబ్ధిదారుల ఎంపికకు మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు మండల తహసీల్దార్ సంఘమిత్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గ్రామసభలను విజయవంతం చేయాలని కోరారు.

సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



పనులకు శంకుస్థాపన చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మునగాల : మండలంలోని వెంకట్రాంపురం గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.5లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులకు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కీత రమేష్ సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కాలె సామియేలు, జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, నలబోలు సతీష్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తక్కెళ్లపాటి సాయి, మైలారిశెట్టి సైదయ్య, కోడి నర్సయ్య, నాగేశ్వరరావు, నరేష్, వీరభద్రం, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'సర్వేల పేరుతో పథకాల అమలులో కాలయాపన'

మునగాల : రాష్ట్ర ప్రభుత్వం సర్వేల పేరుతో సంక్షేమ పథకాల అమలులో కాలయాపన చేస్తుందని తెలంగాణ రైతు సంఘం ఉపాధ్యక్షుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు ఆరోపించారు. మంగళవారం మునగాలలోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో సర్వేలు, గ్రామసభల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తుండడంతో అర్హులైన నిరుపేదలు తమకు సంక్షేమ పథకాలు అందుతాయో.. లేదోనని ఆందోళన చెందుతున్నారని తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సైతం సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు.

23న కమిటీ ఎన్నిక

గరిడేపల్లి : మండల కేంద్రంలో ఈ నెల 23న ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నూతన మండల కమిటీలను ఎన్నుకోనున్నట్లు ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ హుజూర్‌నగర్ ఇన్‌చార్జ్ బచ్చలకూరి ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ యాతాకుల రాజన్న, జిల్లా సీనియర్ నాయకుడు మంద భిక్షం హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామం నుంచి యువకులు, సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అభివృద్ధిలో మంత్రి ఉత్తమ్ ముద్ర



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

హుజూర్‌నగర్ : నియోజకవర్గ అభివృద్ధిలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ముద్ర సుస్పష్టంగా కనిపిస్తోందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. నియోజకవర్గంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల చిత్రాలతో ఓయూ జేఏసీ నాయకులు, టీపీసీసీ జాయింట్ సెక్రెటరీ సీహెచ్. శ్రీధర్ ముద్రించిన క్యాలెండర్‌ను సోమవారం హుజూర్‌నగర్‌లో కాంగ్రెస్ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యారగని నాగన్నగౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్‌రావు, నాయకులు మంజునాయక్, దొంగరి వెంకటేశ్వర్లు, గల్లా వెంకటేశ్వర్లు, కారంగుల వెంకటేశ్వర్లు, ఆదేర్ల శ్రీనివాస్‌రెడ్డి, కుక్కడపు మహేష్, యోహాన్, ఉపేందర్, సుదర్శన్, గురవయ్య, భాస్కర్‌నాయక్, చిరంజీవి, గణేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న వాసవీ, వనితా లెజెండ్ క్లబ్‌ల కార్యవర్గ సభ్యులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ వాసవీ క్లబ్, వనితా క్లబ్ లెజెండ్ కార్యవర్గం ప్రమాణస్వీకారాన్ని సోమవారం స్థానికంగా నిర్వహించారు. వాసవీ క్లబ్ నూతన అధ్యక్షుడు కరలపాటి పాపారావు, ప్రధాన కార్యదర్శులు వీరవిల్లి వెంకటేశ్వర్లు, కొండలు, కోశాధికారి ఉప్పల వెంకటేశ్వర్లు, వనితా క్లబ్ లెజెండ్ అధ్యక్షురాలు పోలిశెట్టి ఝాన్సీరాణి, ప్రధాన కార్యదర్శి త్రిపురశక్తి ప్రవళిక, ట్రెజరర్ కొండా లీలతో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో వంగవీటి గురుమూర్తి, వంగవీటి లోకేశ్వరరావు, బికుమల్ల కృష్ణ శబరి, కొత్త లక్ష్మణ్, పబ్బా గీత, జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు మాశెట్టి అనంత రాములు, గజ్జి ప్రభాకర్, దాస నాగేశ్వరరావు, మట్టపల్లి శ్రీమన్నారాయణ, కండె వెంకటేశ్వర్లు, పోలిశెట్టి వెంకటేశ్వర్లు, త్రిపురమల్ల అంజయ్య, ఉప్పల రామ్ నరేష్ పాల్గొన్నారు.

పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ కమిటీ ఎన్నిక



ఎన్నికైన బిల్డింగ్ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గం

నేరేడుచర్ల : రాజీవ్‌గాంధీ బిల్డింగ్ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నేరేడుచర్ల మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం పట్టణంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవ సలహాదారులుగా ఇంజమూరి జానయ్య, ఇంజమూరి మల్లయ్య, వల్లూరి భిక్షం, అధ్యక్షుడిగా సయ్యద్ హుస్సేన్, ఉపాధ్యక్షుడిగా నన్నెపంగ శ్రీను, ప్రధాన కార్యదర్శిగా ఒగ్గు సైదులు, కుర్రి వెంకన్న, కోశాధికారిగా యడవల్లి సందీప్, సభ్యులుగా పాటు రాంబాబు, సైదులు, మట్టయ్య, నగేష్, సురేష్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.